వంటకాలేని రామం వండటానికి కూర్చున్నాడు. వండక తప్పదు. చెమ్మ తగిలిన అగ్గిపెట్టెలో అగ్గిపుల్లలు 'మేం వెలగం, నీ దిక్కున్నచోట చెప్పుకో' అంటున్నాయి. దిక్కులేదు కనుకే యింత బాధ పడుతున్నానని వాటితో చెప్పలేదు రామం. రామం పైకి చెప్పలేకపోయినా రెండు కళ్లతోనూ చూసి కొద్దిసేపు ఆలోచించిన వాడికి తెలుస్తుంది; ఆ గదిని వాడుతున్న ఆ సామికి ఆపదిక్కు ఏమీ లేదని. గదికి ముందున్న వరండా యింటి యజమానులు తుడిపించుకుంటారు కాబట్టి శుభ్రంగా వుంటుంది. రామం అద్దెకు తీసుకున్న ఆ ఒక్క గదీ, గదివెనుక తడికెలు అడ్డుతోవున్న చిన్న వరండా మాత్రం సాలెగోజుల కోకమారు ధూళి దులుపుకుంటాయి; సంవత్సరానికి ఒక్కసారే, భోగినాడు భార్య బలవంతాన తలలంటుకునే వాళ్లలా, దయాదాక్షిణ్యాలు లేని అగ్గిపుల్లలు పెట్టెలోనుండి ఒకదాని వెనుక ఒకటి వస్తో వున్నాయి. 'వెలగం', అని దబాయిస్తూనే వున్నాయి. చిరాకెత్తి అగ్గిపెట్టె విసిరేసేడు. కాని చేతనాలే చెప్పినట్టు వినని యీ రోజుల్లో అచేతనాలు అసలు వినవన్న సంగతి గుర్తు రావడానికి అట్టేకాలం పట్టలేదు అతనికి. వెళ్లి అగ్గిపెట్టె తెచ్చేడు. ముందుంచే పుల్లలు అరచేతిలో, వేడెక్కేటట్టు పామేడు. అగ్గిపుల్లలు రెండు తీసి రెండు చేతుల మధ్య పామి వెలిగించేడు. అగ్గిపుల్ల పరాజయాన్నంగీకరించింది. పక్కనున్న న్యూస్ పేపరు తగలబెట్టి బొగ్గుల కుంపటి ముట్టపెట్టేడు విజయసూచకంగా రామం. కొద్దిసేపటికి బొగ్గులు రాజుకున్నాయి. తపేలాలో నీళ్లుపోసి కుంపటి మీద పెట్టేడు. కొంతసేపు అయాక కాసిన్ని నీళ్లు తీసుకొని కాఫీ కలుపుకుని మిగిలిన నీళ్లు యింకాస్త మరిగాక వాట్లో బియ్యం వేసేడు.

గదిలో కూర్చుని కాఫీ తాగుతుండగా రామం మనోనేత్రంముందు కదిలాయి కొన్ని దృశ్యాలు. ఆఫీసునుండి వస్తుండగానే తువ్వాలు భుజాన్ని వేసుకొని, మొహం కడుక్కోవడానికి నీళ్ళుపట్టుకుని, మందహాసంతో యెదురై, గుమ్మం దగ్గర చెంబు పెట్టి, కాలిజోళ్ళు తీసి, పాదాలు కడిగి... అచ్చే చిత్రం మరీ పౌరాణికంగా వుంది. పౌరాణికంగావున్న చిత్రం తెరమీద నుండి తొలగిపోయింది. ఇంకొక బొమ్మ, 'బాపు' బొమ్మల్లోలాంటి అమ్మాయి మనిషి నాజూగ్గా, సన్నగా, పొడుగ్గా కోల మొహంతో, పెద్దకళ్ళతో, చిన్న పెదిమలతో పొడుగాటి జడతో వుంది. ఆఫీసునుండి రాగానే మందహాసంతో యెదురై తర్వాత తను టేబిలు యెదుట కుర్చీలో కూర్చొని వుండగా, ఫ్లాస్కులో వేడివేడి కాఫీ టేబిలుమీద వున్న కప్పులోపోసింది. టేబిలు అంచున కూర్చుని తన జడని భుజంమీదుగా ముందుకు తీసుకొని కుడిచేత్తో దాన్ని పట్టుకొని ఎడమచేతి అరచేతిమీద ఆ జడను కొడుతూంది. ఇంతలో గదిదగ్గర ఉఱుము ఉఱిమినట్టు శబ్దమయింది. అమ్మాయి అదృశ్యమయింది. రామం శరీరం త్రుళ్ళిపడ్డది. గ్లాసులో సగానికున్న కాఫీ ఒలకబోయి ఒలకలేదు. ఉఱిమినట్టు వీధివాకిట్లోంచి అరచిన పోస్టుమేన్ దగ్గరకువెళ్ళి ఉత్తరం తెచ్చుకున్నాడు రామం. ఉఱిమిన పోస్టుమేన్ పిడుగులాంటి వార్త తెచ్చేడు. రామం ఉత్తరం చదువుకున్నాడు.

"మనుమడు చిరంజీవి రామునికి దీవించి వ్రాయునది: ఇచ్చటంతా క్షేమం. అచ్చట నీయోగక్షేమముల గురించి తరచు వ్రాయవలెను. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూండు. వంటకు చాలా యిబ్బంది అవుతున్నట్టు వ్రాసేవు. అవును నిజమే. హోటలు భోజనం బాగున్నా కాని నీకు అభోజనం పడటం లేదంటావు. ఎలాగో కొంతకాలం ఓపికపట్టు. నువ్వొక ఇంటివాడివయ్యాక భోజనానికి ఏయిబ్బందీ లేకుండా సుఖంగా వుండగలవు. కాని ఒక విషయం తెలియవచ్చింది. ఆ వేళ నిన్ను యిక్కడకు పిలిచి అంత బోధపర్చినా నువ్వు ఆ వెంకట్రాజు అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికే సిద్ధపడుతున్నావట. పెద్దవాళ్లం మేం ఉన్నామన్న సంగతి మరచిపోయావా? వాళ్లు మన అంతస్తుకు తగరు. మన పూర్వీకులు ఎవ్వరు కూడా అటువంటి వంశాల పిల్లల్ని చేసుకోలేదు. చేసుకోకూడదు. పెళ్లి కాని అబ్బాయిలకి పొరుగూళ్లలో యిదే చిక్కు. అయినా వాళ్ల అమ్మాయిని చేసుకోమని అతగాడు నిన్ను ఎలా అడిగాడు. చేసుకోనని ఖచ్చితంగా మొహంమీద చెప్పేయ్. మొహమాట పడకు......" ఇదే ధోరణిలో యింకా చాలా పొడుగుసాగింది ఉత్తరం. సాగినంతవరకు సావకాశంగా చదివాడు రామం.

కుతకుత ఉడికేడు రామం. కుతకుత ఉడుకుతోంది పొయ్యిమీద అన్నం. అన్నాన్ని వార్చి ఓమూలని పెట్టేడు. కూరగాయలు దాస్తున్న బుట్ట దగ్గరపెట్టుకుని కత్తిపీట దగ్గర కూర్చున్నాడు. బుట్టలోంచి ముదిరిన బెండకాయలొచ్చాయి. కొన్నప్పుడు అనిపించలేదు గాని యిప్పుడవి ముదిరినట్టు అనిపిస్తుంది రామానికి. 'బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా...' అనుకుని నవ్వుకున్నాడు. తప్పదు మరొక కూరలేదు. ముదిరిన బెండకాయలే ముక్కలక్రింద తరిగి వేపుడు చేసుకున్నాడు.

వంటయిన తరువాత గదిలోకి వెళ్లేడు. పరుపు దగ్గర ధూళి న్యూస్ పేపరుతో దులిపి పరుపుకు చేరవేసేడు. పేపరు చదువుకోవాలి అనుకున్నాడు, చదవలేకపోయాడు. చూసిన ఆ ఉత్తరం మరి చూడకూడదనుకున్నాడు. చూడకుండా ఉండలేకపోయాడు. ఇలాంటి ఉత్తరాలు కొత్తకాదు రామానికి. సగటున వారానికి ఒకటైనా వస్తుంది. ఒకొక్కప్పుడు వారానికొకసారి శ్రమపడవలసిన అవసరం లేకుండా తాతగారు ఉత్తరాలు అచ్చొత్తించలేదేమా అని ఆశ్చర్యపోయేవాడు రామం. అయిదేళ్ల క్రితం క్షేమసమాచారాలతో ప్రారంభమయిన ఉత్తరాలు, మూడేళ్ళనుండి 'నువ్వొక యింటివాడవవగల' వని ఆశిస్తూ, సంవత్సరం నుండి ఈ వేళటి ఉత్తరంలా వెంకట్రాజు కూతుర్ని గాని చేసుకున్నావంటే లాభంలేదని బెదిరింపులోకి దిగేయి.

ఈ వేళటి ఉత్తరంలోలా 'నువ్వొక యింటివాడి వయితే' అని వ్రాసిన మొదటి ఉత్తరం తోటే ఒకయింటి వాడైతే పాటికి రామానికి ఓ చంటివాడు వుండివుండేవాడు. చంటివాడు......చంటివాడు జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు రామం. చంటివాడుంటే తాతగారికి మనవడి కొడుకు. ఎంతఅదృష్టవంతుడౌతాడు తాత. మనుమడి మనుమడు అంటే కొడుకు కొడుకు కొడుకు కొడుకు పుట్టిన వరకు బ్రతికుం

ఎంతో అదృష్టం అని నాయనమ్మ అంటుండేది. ఆడపిల్లల ద్వారా కలిగే మనుమలు లెఖ్ఖ లేదట. మరెందుకు వెర్రితాత వాకు వేగం పెళ్లి చేయడు అనుకున్నాడు రామం.

రామానికి పదవయేట తండ్రి పన్నెండవ యేట తల్లి తనకంటె రెండు సంవత్సరాలు చిన్నదైన చెల్లెల్ని అప్పజెప్పి వెళ్లిపోయారు. దేశాంతరం కాదు, లోకాంతరం. రామానికి మిగిలిన బంధువులల్లా ఆ ఒక్క చెల్లీ. తండ్రితండ్రి అయిన తాతగారు, నాయనమ్మ, ముగ్గురు పినతండ్రులూ, వాళ్ళ కుటుంబాలు. అతనికి తల్లి వంక చుట్టాలు ఎవరూ లేరు. పెరిగి పెద్దయిన పినతండ్రులు బుద్ధిగా చదువుకుని పట్నాల్లో ఉద్యోగాలు సంపాదించేరు. తమ చదువులకి ఖర్చయిపోగా మిగిలిన 'భోడి అయిదెకరాల భూమి' ఎవరికి కావాలని ఆ భూమినీ, ఆ భూమిని తమతోపాటు సమానంగా చూచిన తండ్రినీ కాదని పట్నాల్లో కులాసాగా పెళ్లాం బిడ్డలతో కాలక్షేపం చేస్తున్నారు పినతండ్రులు.

సంప్రదాయ కుటుంబాలు కావాలి రామం తాతగారికి, వేలు కట్నాలు కావాలి సంప్రదాయ కుటుంబాలకి. సంప్రదాయం ఉండి కట్నాలు అడగని ముప్పయ్యయిదు సంవత్సరాల రెండవ పెళ్లి వాడికిచ్చి చేసేరు రామం చెల్లి పెళ్లి. అప్పటికే రామం చెల్లెలికి ఇరవై సంవత్సరాలు దగ్గర పడుతున్నాయి. రామానికి ఇరవై రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్నాయి. అతను మెట్రిక్ పాసయి యింట్లో కూర్చున్న రోజుల్లో ఇంట్లోపిల్లి వీధిలో పులి లాంటి ఆఖరి పినతండ్రి, భార్యకు తెలియకుండా చేసిన ప్రయత్నాల వల్ల ఇరవై యొకటవ యేట ఉద్యోగం దొరికింది. పంచదార ఫాక్టరీలో పని.


మొదట్లో హోటలు భోజనం చేసేవాడు రామం. కాని ఆ భోజనం పడలేదు అతనికి. తప్పనిసరయి 'చెయ్యి కాల్చుకోవడం' మొదలు పెట్టేడు. 'చెయ్యి కాల్చుకున్న' రామానికి కొన్నాళ్ళకు 'చెయ్యూతగా' వుంటే బావున్నని పించింది. చెల్లి పెళ్లి జరిగాక ఆలోచిద్దామనుకున్నాడు. చెల్లి పెళ్లి అయింది. తన పెళ్లి ప్రసక్తి ఎలా తేవడమో తెలియక సిగ్గుపడి ఊరుకున్నాడు కొంత కాలం. క్రమేపి వివాహవాంఛ సూచిస్తూ ఉత్తరాలు వ్రాయడంలో సిద్ధహస్తుడయ్యాడు. వాళ్ల తాతగారు ఆ ఉత్తరాల అర్థం గ్రహించేరు అయినా మొదట్లో ఏమీ తెలియనట్టు ఊరుకునేవారు. తర్వాతతర్వాత తప్పక ఓ యింటి వాడివవగలవని ఆశీర్వదిస్తూ వ్రాస్తూ వచ్చేరు. కాని తాతగారికి కావలసినవి సంప్రదాయకుటుంబాలు. సంప్రదాయ కుటుంబాలకు, అందులో సంపద వున్న వాళ్లకు రామంవంటి చిన్న ఉద్యోగాలు చేసేవాళ్లు సాధారణంగా నచ్చరు. సంప్రదాయం వుండి, సంపద లేని సంబంధాలు తాతగారికి నచ్చినా 'నామోషీ' అని నాయనమ్మకు నచ్చలేదు. రామం పినతండ్రులు తలుచుకుంటే అతనికి చక్కని సంబంధం వచ్చేది. వాళ్లు తలుచుకోలేరు. సంబంధం కుదరలేదు. రామం పెళ్లి కాలేదు.

ఇంతలో రామానికి ఇల్లు అద్దెకిచ్చిన వంకట్రావు వాళ్ల అమ్మాయిని అతనికి 'అంటగట్టడానికి' చూస్తున్నట్టు రామం తాతగారికి తెలిసింది. ఆయన ఉగ్రులయ్యారు. రామాన్ని యింటికి పిలిచి బోధ చేసేరు. తర్వాత వారానికొక ఉత్తరం వ్రాస్తూ ఆ సంబంధం చేసుకోవద్దని హెచ్చరిస్తూ వచ్చారు. 'కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా' ఆగదు నాయనా అని సమాధానపరుస్తుండేవారు ఉత్తరాల్లో ఆయన రామాన్ని.

'కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదు' అనే సామెతకు ప్రత్యక్ష తార్కాణం తానే అవుతానని అనుకోలేదు రామం. ఒకనాటిరాత్రి అన్నవరం కొండమీద తనవంక చుట్టాలు ఎవరూ లేకుండా, ఆఖరికి చెల్లెలయినా రాకుండా తన వివాహం జరుగుతుందని అనుకోలేదు రామం. అనుకోనివే జరుగుతుంటాయి. అలానే జరిగింది.

తన ఆర్థిక పరిస్థితికి పెళ్లి చేసుకోవడం అనవసరం అనుకున్నాడు రామం ఒకప్పుడు. తపోనిష్ఠ, జ్ఞానతృష్ణ, మానవసేవాభిలాష వున్న వాళ్లు సాధారణంగా బ్రహ్మచారులుగా వుంటారు. ఉండగలరు. ఉద్యోగం, ఆహారం, నిద్ర తప్ప మరొక ఆలోచన లేని వాళ్లకు వివాహజీవనం అవసరముంది. తప్పదు...... 'పెళ్లి చేసుకోక తప్పదు' అనుకున్నాడు రామం. కాని తను అద్దెకుంటున్న యింటివాళ్ల అమ్మాయినే చేసుకోవాలి అనుకోలేదు. తాతగారు ఊరికి పిలిచి చివాట్లు పెట్టేక కాని ఆవిషయం అతని ఆలోచనలోనే లేదు. 'పరాయివాళ్లమా ఏమిటి, మాయింట్లోనే భోంచెయ్యకూడదా?' అనడం, తరచుగా టిఫిన్ కాఫీలు వారి చిన్నబ్బాయిచేత పంపిస్తుండడం, పండుగ ఏదైనా వస్తే వంటచేసుకోవద్దని బలవంతపెట్టి పిండివంటలతో వడ్డన చేయడం మొదలైనవాటికి కారణం అప్పటికి గాని తెలియలేదు రామానికి. ఎప్పుడైనా ప్రమాదవశాత్తు ఎదురుపడితే ఆ యింటి అమ్మాయి లేడిగంతులు వేస్తూ యింట్లోకి పారిపోవడం, వీధి వరండా ఎప్పుడూ శుభ్రంగా వుండడం కూడా తన వెనుక జరుగుతున్న రహస్యపుటాలోచనల పర్యవసానమా అని అనుమానం కలిగిందతనికి. కాఫీ తాగుతూ కలలుగన్న అమ్మాయిల్ని వదలి ఆయింటి అమ్మాయి కమల గురించి ఆలోచించలేదు. ఆమెను చూసింది ఒకటి రెండు సార్లే అయినా అమ్మాయి నచ్చిందని అనుకున్నాడు.

అమ్మాయికీ, అమ్మాయి అమ్మగారికీ కూడా అబ్బాయి నచ్చాడు. ఫాక్టరీ పనిపాటల్లో చక్కగా మసలుకోవడాన్ని తనకూ నచ్చాడు. ఇంక వేరే సంబంధం ప్రయత్నించడం 'మేకపిల్లను చంకను పెట్టుకొని ఊరంతా వెదకడం, లాంటిది' అనుకున్నాడు వెంకట్రావు. రామానిది చిన్న ఉద్యోగమే అయినా తను తల్చుకుంటే పెద్దఉద్యోగం వేయగలడు. అతని పినతండ్రులు కూడా పెద్ద ఉద్యోగాలలో వున్నారు. మంచి సంప్రదాయ కుటుంబీకులు అనుకున్నాడాయన. ఎన్నాళ్లు చాటుమాటున ప్రయత్నాలని మంచిరోజు చూసుకొని ఒకనాడు రాత్రి రామాన్ని పిలిచి మా అమ్మాయిని పెళ్లి చేసుకుంటావోయ్ అని అడిగేడాయన. సిగరెట్టు పొగ అలవాటు లేనప్పుడు, ఎదుట వాడు సిగరెట్టు పొగ మొహం మీద వదులుతూ మాట్లాడినప్పుడు లాగా

# 1957 లో మీ యొక్క అదృష్టము

ఒక పోస్టు కార్డుపైన మీకిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీ చిరునామాయున్నూ వ్రాసిపంపినచో రాబోవు 12 మాసములలోను మీ జీవితవిశేషాలను అనగా వ్యాపారంలో లాభనష్టములు, ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, సంతానము, వివాహసౌఖ్యములు, ఆరోగ్య విషయము మొదలగు వాటిని గురించి స్పష్టముగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము (పోస్టేజి ఛార్జీలు ప్రత్యేకం.) దుష్టగ్రహము లేవైన యున్న నివారణచేసికొనుటకు తగు విధానంకూడా తెలుపబడును. ఒకసారి పరీక్షించి చూడుడు.

PARSIDH JYOTISH KARYALA (A. W.)
Kamla Market, New Delhi.

# ★ వాల్ పోస్టర్ నవ్వింది ★

ఉక్కిరి బిక్కిరి అయ్యాడు రామం. ఆలోచించి చెప్తానులెండి అని గదిలోకి వచ్చేశాడు.

ఆలోచించాడు. తీవ్రంగా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా తాతయ్య వాదన నచ్చడం లేదు రామానికి. రామం వాళ్ళయింటి పెద్దవాళ్ళు, వాళ్ళ పూర్వీకుల రోజుల్లో రాజ్యాలు ఏలగా వెంకట్రాజు వాళ్ళయింటి పెద్దవాళ్ళు యీ రాజ్యాలేలే వాళ్ళ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడే వారట. అంచేత ఆ యింటి పెద్దవారు రామం యింటి పేరువంటి యింటి పెద్దవారితో వియ్యమందదగినవారు కారట. ఆ వాదనలో బలమేమీ లేదు. ముత్తాతలనాడు రామం ముత్తాతలే గొప్పవాళ్ళయినా యీనాడు తన తాతగారే డెబ్బయ్యవయేట వచ్చినా యింకా పొలం చూసుకుంటూ వుండగా, వెంకట్రాజు తోటలూ, భూములతో, పంచదార ఫాక్టరీలో షేర్లతో, ఫాక్టరీ డైరెక్టర్లలో ఒకడై హాయిగా కాలుమీద కాలువేసుకుని బతుకుతున్నాడు. అసలు యీనాటి పరిస్థితిలో ఆయన పిల్లని స్వీకరించడమే గొప్ప విశేషం. కాకపోతే ఏదో చిన్న గుమాస్తా ఉద్యోగం చేసేవాడికి వాళ్ళ ఫాక్టరీ డైరెక్టరు పిల్లనిస్తానని వస్తాడంటే ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవడంలో తప్పులేదనుకున్నాడు రామం. తాతయ్యగారిమాట యీ విషయంలో వినక్కరలేదనుకున్నాడు. ఊరంతా తిరగనక్కరలేకుండా చంకలో మేకపిల్ల 'మే' అన్నట్టు రామం, పెళ్ళికి 'ఊఁ' అన్నాడు.

రామం కోరికమీద అన్నవరం కొండమీద అతని వంకవారు ఎవరూ రాకుండా రామం పెళ్ళి అయిపోయింది. పెళ్ళి అయిన తరువాత అతని వైవాహ్యజీవితంలో జరిగిన పెద్దమార్పులు మూడేమూడు. ఇన్నాళ్ళ అద్దెకుంటున్న యింట్లో చొరవగా తిరగగలగడం, గుమాస్తా ఉద్యోగం నుండి ఒక్కసారిగా ఫాక్టరీ అసిస్టెంటు సెక్రటరీ అవడం, తాతగారి దగ్గరనుండి ప్రవాహంలా వచ్చే ఉత్తరాలు 'బంద్' అవడం. ఈ మూడు సంఘటనలకీ మొదట్లో సంతోషమే కలిగినా కొంతకాలానికి తాతగారిదగ్గరనుంచి ఉత్తరాలు రాకపోతుండడం ఏదో వెలితి అనిపించేది రామానికి. సుమారు ఇరవైయేడు సంవత్సరాల బంధాలు ఒక్కసారి తెగిపోయాయా అనిపిస్తుండేది. అప్పుడు అందరికీ దూరమయ్యాడు. అత్తవారింటిదగ్గిర తప్ప అతనికి ఆప్తులు లేరు. తరుచు రోగక్షేమాలు తెలుసుకొని తన అభివృద్ధికి ఎంతో సహాయపడిన పిల్లిలాంటి ఆఖరి పినతండ్రి కూడా పెద్దపులిలా అయి, రావడం గాని, ఉత్తరం వ్రాయడం గాని చేయడం లేదు. రామం అప్పుడందరూ నిక్షేపంలాంటి కుర్రాడు పాడయిపోయాడనుకున్నారు. నిజే పాలు దాచుకున్న వాళ్ళకు దక్కవు.

కాలగమనం రామం కోరిక నెరవేర్చింది. పెళ్ళయిన రెండు సంవత్సరాల నాలుగు మాసాలకి, రామం మరి ఆరుమాసాల్లో అబ్బాయిని అందుకోబోతున్నాడు. తన కోరిక నెరవేరినందుకు భార్య కమల కోరిక నెరవేర్చవలసివచ్చింది రామం. కమల కోరింది 'గొంతెమ్మకోరిక' కాదు, వింత కోరిక. అసలు ఆడవాళ్ళు ఎప్పుడూ వింత కోరికలే కోరుతుంటారేమో. ముందెప్పుడూ ఎవరూ కనీవినీ యెరుగని బంగారు పేడిని తెమ్మంది సీత, పోయిన ప్రాణాలు మరి రావని తెలిసికూడా భర్త ప్రాణాలు తెమ్మంది యమధర్మరాజుని సావిత్రి, వైధవ్యం అనుభవిస్తున్నా 'నీలాంటి బిడ్డన్ని ప్రసాదించవయ్యా దేవా' అని ద్రాక్షారామ భీమేశుడిని కోరింది వేములవాడ భీమకవి తల్లి, ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేని రామం తాతగారింటికి వెళ్తానంది కమల. దేవతలే ఆడవాళ్ళ కోరికలు నెరవేర్చ సిద్ధపడినప్పుడు మానవమాత్రుడెంత! మానవమాత్రుడైన రామం కమలను ఒప్పించలేక చివరకు తాతగారి ఊరు ప్రయాణానికి ఒప్పుకున్నాడు.

సుమారు నాలుగు సంవత్సరాలకి తిరిగి తాతగారింట్లో అడుగుపెట్టేడు రామం. వీధివరండాలో వున్న వీధిగుమ్మం దాటంగానే యెదురుగా వరండా, ఎడమచేతి ప్రక్క ఓగది, ఒక చావడి, దాని తర్వాత వంటిల్లూ, అంతే రామం తాతగారి యిల్లు. అంతా మట్టితో కట్టిందే. వీధిగుమ్మంలో నిలబడి లోపలికి చూశాడు రామం. గది దగ్గర వరండాలో ముగ్గురు పిల్లలు బొమ్మలు మధ్యపెట్టుకుని ఆడుకుంటున్నారు. రామం నెమ్మదిగా యింటికి వచ్చినట్టు సూచన. వాళ్ళకి కొద్దిదూరంలో వరండా అంచున పడకకుర్చీలో పడుకొని చుట్ట కాల్చుకోవడంలో తన్మయులై ఉన్నారు రామం తాతగారు. పడకకుర్చీలో చేరబడిన ఆయన లేచి కూర్చొని నోట్లో చుట్టతీసి చెక్కకి తుపుక్కున ఉమ్మి అప్రయత్నంగా వీధిగుమ్మంవైపు తిరిగి చూసేరు. రామాన్ని చూసి ఆశ్చర్యపోయి కొద్ది క్షణాలసేపు మాట్లాడలేదు. తర్వాత 'దయచేయండి. నిలబడిపోయారేం' అన్నారు వెటకారంగా. అసలు వెటకారంగానైనా మాట్లాడరేమో అనుకున్న రామానికి ఆశ్చర్యం కలిగించింది. ఊరి పొలిమేర దగ్గరనుండి సముద్రపు కెరటాల్లా పైకెగసి


ఓం తత్ సత్

కే. టి. కృష్ణమూర్తి ఆచారిగారి

"మేల్ మాయిల్ మందు"



ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్ఠురోగ నివారిణి

భయంకరమైన మేహవ్యాధివల్ల కష్టపడు వారలకు

పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి.

మేహరోగ నివారణ నూనె, లేహ్యం.

వల్లమేహ, ఎర్రమేహ, పొడిలు మేహారణములు, తిమ్మిర్లు, మతిమాంద్యము, కుష్ఠములు, పిత్తకారితము, మాతకవ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్ళ చేతులు మంట, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం, మూలవ్యాధి, మలబద్ధం మొదలైన అన్ని విధముల దుర్నీకవ్యాధులను పోగొట్టును. 40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యం, రు. 8/- తపాల్ ఖర్చులువేరు.

వివరములను కేట్లాగులో చూడవచ్చును.

కే. టి. కృష్ణమూర్తి ఆచారి అండ్ సన్సు, 6/22, మేల్ మాయిల్ పోస్టు, (N.A.Dt.)



"జి.ఇ.సి" మోటారు

మోటారు స్పేరుకు పంపు సెట్లు

రడీస్టాకునుండి

ఇవ్వగలము

తాతా - ప్రభాత

(తంతి ... తత ప్రభ)

విజయవాడ ...2



వైటోడెంట్

దంతక్రిములను

సంహరించే పండ్లపొడి

శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్



లిమిటెడ్. మద్రాసు-30.

పడుతున్న అతని గుండెలు ఉధృతం తగ్గించాయి. రాని చిరునవ్వు ఒకటి మొహంమీదికి వచ్చింది. లోపలికి ప్రవేశించారు. ఇంతలో నాయనమ్మ వంటింట్లోంచి వచ్చింది. ఇంకా గుమ్మందగ్గరే వుండిపోయిన కమలని చూసి వెంటనే రామం చెల్లెలుచేత హారతి యిప్పించి ఆచారప్రకారం యింట్లోకి ప్రవేశింపజేసింది. కమలా, రామం చెల్లెలూ వంటింట్లోకి వెళ్ళిపోయారు. నాయనమ్మ మనుమడితో సంభాషణ ప్రారంభించింది.

రామం తాతగారు చాలా గంభీరులు. ఆయనకి పట్టుదలా, పౌరుషం ఎక్కువన్న విషయంతప్ప మరేమీ తెలియదు రామానికి. అందుచేతనే ఆయన అసలు తన్ను పలకరించనే పలకరించరు అనుకున్నాడు. కాని ఆయన శత్రువైనా యింటికివస్తే ముందు పెద్ద మనిషి తరహాగా పలకరించి తర్వాత్, తగువు పెట్టారు. వ్యంగ్యంగా మాట్లాడుతూ యెదుటి వాడిని ఏడిపించడంలో ఆయనకి ఆయనే సాటి. నాయనమ్మా మనుమల సంభాషణ మధ్యమధ్య అక్కడక్కడ కలుగజేసుకొని ఎవరినో ఉద్దేశించి అన్నట్టు ఏవో మాటలు వ్యంగ్యంగా అన్నారు తాతగారు. ప్రయాణపు బడలికవల్లా, యిలాంటి సంఘర్షణవచ్చి తీరుతుందని ముందే ఊహించడంవల్లా రామం కూడా ఏమీ తీసిపోలేదన్నట్టు మాట్లాడాడు. దానిమీద తగువు పెరిగింది. రామం తాత గారు పెద్దగా ఏవేవో కేకలువేస్తూ తిట్టారు. రామానికి కోపం వచ్చింది. 'ఇక యీ యింటిగడప తొక్కను' అంటూ వీధిలోకి వెళ్ళి బండి తీసుకువచ్చాడు. కమలని బయలు దేరమన్నాడు.

రామం చెల్లి దీనంగా బతిమాలింది. నాయనమ్మ 'మీ తాతగారి మాటలకి లెక్కేంటి నాయనా. ఎప్పుడూ వున్నదేగా. రెండు రోజులుండి వెళ్లు' అంది. 'వట్టి మనిషికూడా కాదురా. అలా తిట్లుకొట్లాటలతో తిరిగి వెళ్ళకూడదురా' అంది. ఎన్నన్నా వినలేదు రామం. ఏమైనా వుండదల్చుకోలేదు అక్కడ. బండి ఎక్కమన్నాడు కమలని. 'మిమ్మల్ని చూడాలనివుండి వచ్చాం. చూసేంగా యిక ఎప్పుడు వస్తే ఏం నాయనమ్మా' అంది కమల సెలవుతీసుకుంటూ. కేకలువిని గుమ్మందగ్గరకి వచ్చినవాళ్ళూ, అక్కడవరకూ రాకుండా వాళ్ళ వాకిళ్ళ ముందు వాకిళ్ళల్లో నిల్చున్నవాళ్లూ వింతగా కళ్లు అప్పజెప్పి చూస్తున్నారు. కమల బండి యెక్కింది. బండి కదిలింది.

ఆ గ్రామంనుండి నాలుగు మైళ్ళు ప్రయాణంచేసి పట్నంలో రైల్వేస్టేషనుకి వెళ్ళాలి. బండి పట్నం పొలిమేరలు చేరింది. పొలిమేర్లలో ఒక బియ్యంమిల్లు వుంది. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్న రామం అప్రయత్నంగా మిల్లు ప్రహారీగోడవైపు చూశాడు. ఆ గోడమీద 'సంఘం' అన్న అక్షరాలతోనూ, సినిమాతార మందహాసవదనంతోనూ వున్న వాల్ పోస్టర్ నవ్వినట్టు అనిపించింది రామానికి. గంభీరంగా వున్న అతని మొహంలో అస్పష్టంగా మందహాసం గోచరించింది. నవ్విన వాల్ పోస్టర్ నుండి మొహం తిప్పుకుని కమలవైపు చూశాడు. కమల తనలో తను నవ్వుకుంటుంది. ఎలాగైనా కమల వట్టి మనిషి కాదు గట్టి మనిషే అనుకున్నాడు రామం. ★

పూర్తిగా
వాటర్‌ప్రూఫ్ చేయబడిన వాచీలు
—రోలెక్సు తయారులు!

మగవారికి—ట్యూడర్ స్విమ్‌ప్రూఫ్ ఆయిస్టర్ వాచీ: దీని అసలైన ఆయిస్టర్ కేసు, ఎంతో కచ్చితమైన 17 జ్యూయలుల యంత్రమును దుమ్ము, మలినము మరియు నీళ్లమంది పూర్తిగా సురక్షితముగా ఉంచును.

ఆడవారికి—ప్రత్యేకమైన డిజైనులో సొగసైన ట్యూడర్ ఆయిస్టర్ వాచీ. దీని సెకెండ్ల ముల్లు మధ్యలో ఉన్నది కనుక బయట పనిచేసే ఆఫీసు లేక డాక్టర్లకు యీ వాచీ ఎంతో అనువైనది.

మా అన్ని రకముల ట్యూడర్ వాచీలను చూచుటకు దయచేయండి, లేక ఉచితముగా పంపే క్యాటలాగు కావాలని వ్రాయండి.

ట్యూడర్
జెనీవా, స్విట్జర్లాండ్‌లో తయారైన ప్రసిద్ధిగాంచిన వాచీలు

రోలెక్సు వాచ్ కంపెనీ (ఈస్టరన్) ప్రైవేట్ లిమిటెడ్
దక్షిణ భారతదేశమునకు ఏకైక డిస్ట్రిబ్యూటరు.
పి. ఆర్. అండ్ సన్సు ప్రైవేట్ లిమిటెడ్, మౌంట్ రోడ్, మద్రాసు